మందమర్రి మున్సిపల్ ఎన్నికలకు పోరాటాలు

మందమర్రి టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మందమర్రి మున్సి పాలిటీ ఎన్నికల కోసం బీజేపీ ఆధ్వర్యంలో పోరాటాలు చేపడతామని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అందుగుల శ్రీనివాస్, సీనియర్ నాయకులు డీవీ దీక్షిత్‌లు తెలిపారు. సోమవారం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికలు లేకపోవడం మూలంగా ప్రజలు నష్టపోతు న్నారని తెలిపారు. ఎన్నికల ప్రక్రియకు ఎమ్మెల్యే చొరవ చూపాలని కోరారు. మార్త కుమార్, సప్పిడి నరేష్, మల్యాల పార్వతి, ఓదెలు, రవిసాగర్, క్రాంతి కిరణ్, పారుపల్లి శ్రీనివాస్, ఎ సాగర్, డి తమన్ పాల్గొన్నారు.



గౌరవ వేతనం కోసం ఆందోళన

రేషన్ డీలర్ల ముందు ఉన్న ప్రధాన సమస్య గౌరవ వేతనం. నెలకు రూ.30 వేల గౌరవ వేతనాన్ని ఇవ్వాలని డీలర్లు ఎన్నో ఏళ్లుగా పోరాడుతున్నారు. కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో గౌరవ వేతనం కల్పిస్తున్నందున తెలంగాణలోనూ ఇవ్వాలని పట్టుబడుతున్నారు. ఈ డిమాండ్‌పై గత ప్రభుత్వం డీలర్లకు న్యాయం చేస్తామని ప్రకటించింది. కాని పదేళ్లలో ఈ అంశంపై బీఆర్ఎస్ ప్రభుత్వం పెదవి విప్పలేదు. ఇదిలా ఉండగా 2023లో జరిగిన ఎన్నికల సమయంలో కాంగ్రెస్ డీలర్లకు గౌరవ వేతనం హామీ ఇచ్చినట్లు డీలర్లు చెబుతున్నారు. రూ.5 వేల గౌరవ వేతనం కల్పిస్తామనే హామీని ఎన్నికల మేనిఫెస్టోలో కూడా పొందుపరిచినట్లు పేర్కొంటున్నారు. యేడాది గడిచినా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి గౌరవ వేతనం ఇవ్వాలని విన్నవిస్తున్నారు. ఈ విషయమై రెండు నెలల క్రితం హైదరాబాద్‌లో రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బహిరంగ సభ ఏర్పాటు చేసి తమ డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచారు.

- హామీలతోనే ఏళ్లతరబడి జాప్యం
- వినతులు పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం
- గౌరవ వేతనం డిమాండ్ బుట్టదాఖలు
- నెలవారీ కమీషన్లూ జమకాని వైనం

రేషన్ డీలర్ల సమస్యలు తీరేదెన్నడు..?

మంచిర్యాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్లు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. పాలకులకు ఏళ్ల తరబడి మొరపెట్టుకుంటున్నా మోక్షం లభించడం లేదు. నెల రోజులు శ్రమ పడితే చివరకు మిగిలేదనే అభిప్రాయాలు ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక సమస్యలు తీరుతాయని గంపెడు ఆశలు పెట్టుకున్న డీలర్లకు నిరాశే ఎదురైంది. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో డిమాండ్‌లు తీరుస్తామనే హామీలు డీలర్లను ఊరిస్తూ వచ్చాయి. ఏ ఒక్క సమస్యా తీరలేదు. ఎన్నికల హామీల్లో భాగంగా కాంగ్రెస్ డీలర్లకు హామీలు గుప్పించింది. రేషన్ డీలర్లకు గౌరవ వేతనం కల్పిస్తామని మాటిచ్చింది. ఏడాది గడిచినా అది కార్యరూపం దాల్చలేదు. ఇలా ఎన్నో సమస్యలను పాలకులకు ఎప్పటికప్పుడు విన్నవిస్తున్నా కనీసం చర్చలు కూడా జరపడం లేదని పేర్కొంటున్నారు.

సకాలంలో అందని కమీషన్లు..

రేషన్ డీలర్లకు కమీషన్ డబ్బులు ప్రతీనెల క్రమంగా అందడం లేదనే అభిప్రాయాలున్నాయి. రెండు, మూడు నెలలకు ఒకసారి కమీషన్ డబ్బులు అకౌంట్లలో జమవుతున్నట్లు చెబుతున్నారు. నెలవారీగా డబ్బులు అందకపోవడంతో డీలర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 'అమ్మహస్తం' పథకం అమలు చేశారు. బియ్యంతో పాటు చక్కెర, పప్పులు, నూనెతోపాటు 9 వస్తువులను పంపిణీ చేసేవారు. ఇది డీలర్లకు లాభ సాటిగానే ఉండేది. అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక రేషన్ షాపులు బియ్యం పంపిణీకే పరిమిత మయ్యాయి. ఖర్చులు పెరగడం, కమీషన్లు తగ్గడంతో ఇబ్బందుల పాలవుతున్నారు. అమ్మహస్తం మాదిరిగా నిత్యావసరాల సరుకుల విక్రయంపై చర్యలు తీసుకోవాలని డీలర్లు వేడుకుంటున్నారు.

మిగతా 7వ పేజీలో..

ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరిస్తాం



దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ మోతిలాల్

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని అదనపు కలెక్టర్ మోతిలాల్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మంచిర్యాల, మంద మర్రి, కన్నెపల్లి, బెల్లంపల్లి, జైపూర్, కాసిపేట, జన్నారం, నస్పూర్, టేకుమట్ల, రామ కృష్ణాపూర్ ప్రాంతాల నుంచి ప్రజలు దరఖాస్తులు అందజేశారు. అదనపు కలెక్టర్ మాట్లడుతూ ప్రజావాణిలో వచ్చిన ప్రతీ దరఖాస్తును పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకొంటామన్నారు. అధికారులు పాల్గొన్నారు.

కష్టాల్లో మిర్చి రైతు

- పంటను ఆశిస్తున్న చీడపీడలు, తెగుళ్లు
- కన్నెత్తిచూడని ఉద్యానవన, వ్యవసాయాధికారులు

6



పెంచికలపేటలో సాగు చేస్తున్న మిరప పంట

పల్లె నుంచి పట్నం వరకు..

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు ఇద్దరు విద్యార్థులు ఎంపిక

7



సైన్స్‌ఫెయిర్‌లో ప్రాజెక్టు ప్రదర్శిస్తున్న విద్యార్థి దాసరి చరణ్‌తేజ

నిరుద్యోగులను పట్టించుకోని ప్రభుత్వం



మంచిర్యాలలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడాన్ని నిరసిస్తూ సోమవారం యువమోర్చా ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి పాల్గొన్నారు. ర్యాలీని కలెక్టరేట్ కార్యాలయం వద్ద పోలీసులు అడ్డుకోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టరేట్ కార్యాలయం నుంచి బెల్లంపల్లి చౌరస్తా మీదుగా బీజేపీ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ర్యాలీ కోసం ఏసీపీ కార్యాలయంలో అనుమతి పెట్టుకుంటే ఎమ్మెల్యే అనుమతి ఇవ్వకుండా అడ్డుకున్నారన్నారు. నాయకులు రజనీష్‌జైన్, కృష్ణమూర్తి, అశ్విన్, రమణ రావు, శ్రీదేవి, అవోక్, చక్రి, సదానందం పాల్గొన్నారు.

నస్పూర్, (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచిన నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చనందుకు నిరసనగా యువ మోర్చ నిరసన ర్యాలీ నిర్వహించింది. తెలంగాణలో ప్రభుత్వమే మారిందని పాలన మాత్రం కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారంటీల గారడీ చేస్తుందని, ఆరు అబద్ధాలు 66 మోసాలంటూ ముద్రించిన కరపత్రాలను కలెక్టర్ చౌరస్తా వద్ద జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ పంపిణీ చేశారు.

సంబరాలు జరుపుకోవడం సిగ్గుచేటు

మందమర్రి టౌన్, (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంలో ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సాధించింది శూన్యమని బీజేపీ నాయకులు సంజీవరావు తెలిపారు. విలేకరులతో మాట్లాడుతూ ఏదో సాధించినట్లు సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటన్నారు. ఒక వైపు రైతులు వర్షాలతో పంట నష్టపోతే కనీసం సంబంధిత అధికారులు పంట నష్టం అంచనా వేయడం లేదని మండిపడ్డారు. నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని, లేని పక్షంలో ఆందోళన చేపడతామని తెలిపారు.

సమస్యలను పరిష్కరించాలని కార్యదర్శుల వినతి



కాసిపేటలో ఎంపీడీవోకు వినతి పత్రం ఇస్తున్న పంచాయతీ కార్యదర్శులు

హాజీపూర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించాలని సోమవారం కార్యదర్శులు ఎంపీడీవో కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ కొండయ్యకు వినతిపత్రం అందించారు. పనిభారం తగ్గించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు.

దండేపల్లి, (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శులకు పనుల భారం తగ్గించి సమస్యలు పరిష్కరించాలని ఎంపీడీవో ప్రసాద్‌కు కార్యదర్శులు వినతిపత్రం అందజేశారు. ఇతర శాఖల పనులు, సర్వేలు మరే ఇతర పనులకైనా ఆదివారాలు, పండుగల రోజుల్లో మినహాయింపు ఇవ్వాలన్నారు. టార్గెట్లు పెట్టి మానసికంగా, శారీరకంగా కార్యదర్శులకు ఇబ్బంది కలి గించవద్దన్నారు. గ్రామాలలో పాలకవర్గం, నిధులు లేకపోయిన ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పని చేస్తున్నామన్నారు.

మందమర్రిరూరల్, (ఆంధ్రజ్యోతి): పని భారం తగ్గించాలని కార్యదర్శులు ఎంపీడీవో రాజేశ్వర్‌కు వినతి పత్రం అందించారు. అదనపు భారంతో ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. జనాభాను బట్టి మరొకరిని కేటాయించాలన్నారు. ప్రమోషన్‌లు కల్పించాలన్నారు. కార్యదర్శులు వీరేందర్, సంధ్యారాణి, విద్యాలత తదితరులు పాల్గొన్నారు.

భీమారం, (ఆంధ్రజ్యోతి) : పనిభారం తగ్గించాలని మండల పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవోకు వినతిపత్రం అందించారు. అదనపు పని భారంతో ఇబ్బందులు పడుతున్నామని, ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని తెలిపారు.

కాసిపేట, (ఆంధ్రజ్యోతి) : పనిభారం తగ్గించాలని పంచాయతీ కార్యదర్శులు సోమవారం ఎంపీడీవో సత్యనారాయణ సింగ్‌కు వినతిపత్రం అందించారు. సర్వేల పేరుతో కార్యదర్శులపై అదనపు భారం పడుతుందన్నారు. కవిత, మౌనిక, రజిత, సునీత, దీప్తి తదితరులు పాల్గొన్నారు.







మంచిర్యాలలో కేక్ కట్ చేస్తున్న నాయకులు, తాండూర్‌లో జన్మదిన వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు, ఢిల్లీలో సోనియాగాంధీ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న ఎంపీలు

జిల్లా వ్యాప్తంగా సోనియగాంధీ జన్మదిన వేడుకలు

సోనియాగాంధీ జన్మదిన వేడుకలను జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. దశాబ్దాల ప్రత్యేక రాష్ట్ర కలను సోనియాగాంధీ సాకారం చేశారని కొనియాడారు. కేక్ కట్ చేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే పలు గనుల వద్ద సంబరాలు నిర్వహించారు. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిన నేపథ్యంలో ఎమ్మెల్యే నివాసం నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు.

ఢిల్లీలో జన్మదిన వేడుకలు నిర్వహించిన ఎంపీలు

మందమర్రిటౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సోనియాగాంధీ జన్మదిన వేడుకలను సోమవారం పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ నేతృత్వంలో ఢిల్లీలో తెలంగాణ ఎంపీలు ఘనంగా నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ ఆరు దశాబ్దాల ప్రజల ఆకాంక్షలను దృష్టిలో ఉం చుకుని సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రం ఇచ్చారన్నారు.

పులి జాడ కోసం గాలింపు
- లభించిన లేగదూడ కళేబరం


మృతి చెందిన లేగదూడను పరిశీలిస్తున్న అటవీ అధికారులు

వేమనపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సుంపుటం అటవీ ప్రాంతంలో సోమవారం పులి దాడిలో మృతి చెందిన లేగదూడ కళేబరాన్ని అటవీ అధికారులు గుర్తించారు. లేగదూడ కళేబరం చుట్టూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ఎఫ్‌ఆర్‌వో దయాకర్ తెలిపారు. దాడి చేసిన పులి ఆహారం కోసం మళ్లీ ఇక్కడకు వచ్చే అవకాశం ఉన్నందున సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శనివారం ఓ ఆవుల మందపై పులి దాడి చేసింది. ఈ సంఘటనలో ఓ ఆవు పులి దాడిలో గాయపడింది. మరొకటి ఆడవిలోకి వెళ్లింది. అది లేగదూడకు జన్మనిచ్చి సురక్షితంగా ఆదివారం సాయంత్రం ఇంటికి చేరింది. మరో ఆవు కళేబరం అడవిలో లభించిందని ఎఫ్‌ఆర్‌వో తెలిపారు. ఎఫ్‌ఆర్‌వో మాట్లాడుతూ సుంపుటం, కల్లెంపల్లి, ఒడ్డుగూడం అటవీ ప్రాంతాల్లోనే పెద్దపులి తిరుగుతున్నట్లు తెలిపారు. సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పత్తి ఏరేందుకు కూలీలు గుంపులు గుంపులుగా వెళ్లాలని సూచించారు.

రాంపూర్ ప్రాజెక్ట్ సమీపంలో పెద్దపులి సంచారం

భీమిని, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాంపూర్ ప్రాజెక్ట్ సమీపంలో సోమవారం సాయంత్రం పెద్దపులి సంచరిస్తుందని రాజస్థాన్, మహారాష్ట్ర కూలీలు గ్రామస్థులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వంట కోసం కట్టెల సేకరణకు రాంపూర్ ప్రాజెక్టు సమీపంలో వెళ్లడంతో వారికి పులి అగుపించింది. దీంతో హడలి పోయిన కూలీలు అటవీశాఖ వారికి సమాచారం ఇచ్చారు. తాండూర్ ఫారెస్ట్ సెక్షన్ అధికారి సువర్ణ సంఘటన స్థలానికి చేరుకుని పాదముద్రలు గుర్తించే పనిలో పడ్డారు. ఈ నెల 5 పెద్దపేట గ్రామ శివారులో పత్తి చేనులో పులి గాండ్రింపులకు భయపడి ఇద్దరు వ్యక్తులు చెట్టు ఎక్కిన సంఘటన మరువక ముందే సోమవారం రాంపూర్ ప్రాజెక్టు వద్ద పులి సంచరిస్తుందన్న వార్తలతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

మాజీ సర్పంచుల ముందస్తు అరెస్టు

జైపూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ బిల్లులు చెల్లించాలని అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న శివ్వారం, కుందారం మాజీ సర్పంచ్‌లు గణేష్, సమ్మయ్యలను సోమవారం ఉదయం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ శ్రీధర్ తెలిపారు.

చెన్నూరు, (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ముట్టడికి తరలివెళ్తున్న కిష్టంపేట మాజీ సర్పంచు బుర్ర రాకేష్‌గౌడ్‌తోపాటు బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేసి సొంత పూచీకత్తుపై విడిచి పెట్టారు. ఆస్నాద, లంబాడిపల్లి, ముత్తరావుపల్లి మాజీ సర్పంచ్‌ల కుమారులను, సుద్దాల మాజీ సర్పంచు భర్తను అరెస్టు చేసి వదిలిపెట్టారు.

కాసిపేట, (ఆంధ్రజ్యోతి): మాజీ సర్పంచులు, ఉపసర్పంచులను కాసిపేట, దేవాపూర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ముత్యంపల్లి మాజీ సర్పంచు ఆడె బాదు మాట్లాడుతూ పెండింగ్ బిల్లులను విడుదల చేయాలన్నారు. అజ్మీర తిరుపతి, పెంద్రం హన్మంతు, ఆడె శంకర్, బోయిని తిరుపతియాదవ్ ఉన్నారు.

హాజీపూర్, (ఆంధ్రజ్యోతి): ముల్కల్ల, గుడిపేట, పడ్తన్‌పల్లి,బుద్ధిపల్లి మాజీ సర్పంచులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు.

నెన్నెల, (ఆంధ్రజ్యోతి) : నెన్నెల, చిత్తాపూర్, నందులపల్లి, గంగారం, ఘన్‌పూర్, గొళ్లపల్లి, మైలారం, చిన్నవెంకటాపూర్ గ్రామాల మాజీ సర్పంచులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

మందమర్రిరూరల్, (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న మాజీ సర్పంచులు సది, ఒడ్నాల కొమురయ్య, సారంగపల్లి మాజీ సర్పంచు ఫర్హీనా సుల్తానా భర్త ఫిరోజ్‌ను అరెస్టు చేశారు.

కోటపల్లి, (ఆంధ్రజ్యోతి) : ఎడగట్ట, మల్లంపేట, పిన్నారం, రాంపూర్, పారుపెల్లి గ్రామపంచాయతీల మాజీ సర్పంచులను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

వేమనపల్లి, (ఆంధ్రజ్యోతి): వేమనపల్లి మాజీ సర్పంచు కుబిడె మధుకర్, సుంపుటం మాజీ సర్పంచు కొండగొర్ల బాపులను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

హత్యాయత్నానికి పాల్పడిన ముగ్గురి అరెస్టు

బెల్లంపల్లిరూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇంక్లైన్ బస్తీకి చెందిన సంతోష్‌కుమార్‌పై హత్యాయత్నం చేసిన ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు తాళ్లగురిజాల సీఐ అఫ్జలుద్దీన్ తెలిపారు. సోమవారం పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఆదివారం రాత్రి కామెర రాజు, గడ్డం మదన్‌కుమార్, గొర్ల అఖిల్‌ల మధ్య గొడవ జరిగి సంతోష్‌కుమార్‌పై బీరు సీసాలతో దాడికి పాల్పడ్డారు. సంతోష్‌కుమార్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. సంతోష్‌కుమార్ మంచిర్యాల ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని వెల్లడించారు. ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు తెలిపారు.

మహిళను హత్య చేసిన నిందితుడి అరెస్టు

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఆదివారం తీగల భాగ్యలక్ష్మి (46) అనే మహిళను హత్య చేసిన వీరస్వామిని అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం గన్నారం గ్రామానికి చెందిన భాగ్యలక్ష్మి భర్త చనిపోయాక మంచిర్యాలకు వలస వచ్చి మేదరివాడకు చెందిన వీరస్వామితో సహజీవనం చేస్తోంది. ఆదివారం ఇద్దరు మద్యం సేవిస్తుండగా డబ్బుల విషయమై గొడవ జరగగా భాగ్యలక్ష్మిని బండరాయితో మోది హత్య చేశాడని తెలిపారు. వీరస్వామిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచి రిమాండ్ నిమిత్తం తరలించినట్లు సీఐ తెలిపారు.

పోలీసుల తనిఖీలు

వేమనపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టులు సోమవారం రాష్ట్ర బంద్‌కు పిలుపునివ్వడంతో నీల్వాయి పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ప్రాణహిత నది తీరంలో మహారాష్ట్ర నుంచి వేమనపల్లికి వచ్చే ప్రయాణికుల వివరాలను తెలుసుకున్నారు. వారి బ్యాగులను తనిఖీలు చేశారు. ఎస్‌ఐ శ్యామ్‌పటేల్ మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.


చెన్నూరు, (ఆంధ్రజ్యోతి) : మావోయిస్టు పార్టీ బంద్ నేపథ్యంలో చెన్నూరు పట్టణంలో సోమవారం రాత్రి ఏసీపీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. పాత బస్టాండ్, ఆస్నాద చౌరస్తా, జాతీయ రహదారి గుండా వెళ్లే వాహనాలను తనిఖీ చేసి వివరాలను సేకరించారు. లాడ్జీల్లో సోదాలు నిర్వహించారు. ఎవరైనా అపరిచిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సీఐ రవీందర్, ఎస్‌ఐలు సుబ్బారావు,వెంకటేశ్వర్లు, పోలీసులు పాల్గొన్నారు.

అజ్ఞాతం వీడి జన జీవన స్రవంతిలో కలవాలి


రవి కుటుంబానికి సరుకులు అందిస్తున్న పోలీసులు

మందమర్రిటౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మావోయిస్టుల సిద్ధాంతాలకు ఆకర్షితులై అజ్ఞాతంలోకి వెళ్లిన వారు జనజీవన స్రవంతిలో కలవాలని ఏసీపీ రవికుమార్ తెలిపారు. సోమవారం ఊరు మందమర్రికి చెందిన మావోయిస్టు పార్టీ సభ్యుడు బబ్బెర రవి తల్లికి సరు కులు అందజేశారు. వారు మాట్లాడుతూ వృద్ధాప్యంలో ఉన్న తల్లి కోసమైనా రవి లొంగిపోవాలని తెలిపారు. అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టుల కుటుంబాలకు వైద్య చికిత్సలు అందిస్తామన్నారు. సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్‌ఐ రాజశేఖర్ పాల్గొన్నారు.

కష్టాల్లో మిర్చి రైతు



- పంటను ఆశిస్తున్న చీడపీడలు, తెగుళ్లు
- కన్నెత్తిచూడని ఉద్యానవన, వ్యవసాయాధికారులు
- మిరప రైతుకు కనీస సూచనలు కరువు


తెగుళ్లతో ఎదుగదల లేని మిరప పంట

పెంచికలపేట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కొన్ని సంవత్సరాలుగా మండలంలో పత్తి ప్రధానపంటగా పండిస్తున్నారు. పత్తిలో అనుకున్న స్థాయిలో దిగు బడి రాకపోవడం, సాగు ఖర్చులు పెరగడం, పత్తి పంటకు గిట్టుబాటు ధర దక్కకపోవడంతో రైతులు మిర్చిపంట వైపు మొగ్గు చూపారు. దీంతో ఈ ఏడు మిరప సాగువిస్తీర్ణం పెరిగింది. గతేడాది ఎండు మిర్చి ధర ఆశాజనకంగా ఉండడం కూడా రైతులు మిర్చి పండించడానికి మరో కారణంగా చెప్పవచ్చు.

ప్రతికూలంగా మారిన పరిస్థితులు..

ఈ యేడు మిర్చి రైతులకు పరిస్థితులు ప్రతికూలంగా మారాయి. లక్షల రూపాయలు ఖర్చు పెట్టి ఆరుగాలం కష్టపడిన మిరప రైతుకు నష్టాలు తప్పేలా లేవు. విత్తనం విత్తుకున్నప్పటి నుంచి ఇప్పటి వరకు చీడపీడలు, తెగుళ్లపంట దిగుబడిపై ప్రభావం చూపిస్తున్నాయి. మండలవ్యాప్తంగా సుమారు 800 నుంచి 1000ఎకరాల్లో మిరపసాగు చేస్తున్నారు.

క్షేత్రస్థాయిలో పర్యటించని అధికారులు..

ఈ ప్రాంత రైతులకు ఒకరకంగా మిరపసాగులో పూర్తి స్థాయిలో అవగాహన లేదు. అవగాహన కల్పించాల్సిన ఉద్యానవనశాఖ అధికారులు, వ్యవసాయాధికారులు కార్యాలయాలకే పరిమిత మవుతున్నారు. మిరపసాగు వ్యవసాయ క్షేత్రాల్లో పర్యటించి పంట ను పరిశీలించి సూచనలు ఇవ్వాల్సిన బాధ్యత ఉన్న ప్పటికీ అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. రైతులు ఏ సమయంలో ఏ మందులు పిచికారి చేయాలో తెలియక ఇష్టాను సారం ఫర్టిలైజర్, పెస్టిసైడ్‌లను విపరీతంగా వాడు తున్నారు. దీంతో సాగువ్యయం పెరిగి రైతులు నష్టపోయి ఆర్థికంగా చితికిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా సంబంధితశాఖ అధికారులు క్షేత్రపర్యట నలు చేసి రైతులకు మిరపపంటలో మెలకువలు, సూచనలు అందివ్వాలని రైతులు కోరుతున్నారు.

ఎదుగదల లేదు..



మొదటిసారి ఎకరం విస్తీర్ణంలో మిరపసాగు చేస్తున్నాను. నారునాటి నెలలు కావస్తున్నా ఇప్పటికీ ఎదుగుదల లేదు. స్థానికంగా మందుల దుకాణాల్లో మందులు తీసుకువచ్చి పిచికారి చేస్తున్నాను. అయినా ఫలితం లేదు. దీనిక తోడు ఆకుముడత, తెగుళ్ల ఇబ్బంది పెడుతున్నాయి. ఏ మందులు పిచికారి చేయాలో అర్థం కావడం లేదు.

- మండిగ శంకరయ్య, గుంట్లపేట

సూచనలు ఇచ్చే వారు లేరు..



రెండు సంవత్సరాల నుంచి రెండున్నర ఎకరాల్లో మిరప పంట సాగు చేస్తున్నాను. ఈ యేడు సాగు ఆశాజనకంగా లేదు. వ్యవసాయశాఖ అధికారులు, ఉద్యానవనశాఖ అధికారులు వ్యవసాయక్షేత్రాలకు వచ్చిన దాఖలాలు లేవు. అధికారులు క్షేత్రపర్యటన చేసి రైతులకు సూచనలు ఇస్తే బాగుంటుంది.

- తెలిగే రమేష్, ఎల్కపల్లి

సోనియా గాంధీ జన్మదిన వేడుకలు


ఆసిఫాబాద్‌లో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆసిఫాబాద్/వాంకిడి/జైనూరు/బెజ్జూరు/దహెగాం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌పార్టీ అధినేత్రి సోనియాగాంధీ జన్మదిన వేడుకలను ఆసిఫాబాద్ పట్టణంలో, మండలాల్లో సోమవారం కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బాలేష్‌గౌడ్, మల్లేష్, చరణ్, రమేష్, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

చుక్కల దుప్పిని రక్షించిన అటవీ అధికారులు

కెరమెరి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని మురికిలొంక గ్రామసమీపంలోకి మేకల మందతో వచ్చిన చుక్కలదుప్పిని అటవీ అధికారులు పట్టుకుని అడవిలో వదిలిపెట్టారు. గ్రామస్థుల సమాచారంతో జోడేఘాట్ రేంజ్ అధికారి జ్ఞానేశ్వర్, ధనోర సెక్షన్‌అధికారి మల్లయ్య, బీట్ అధికారి స్వప్న చుక్కల దుప్పి ఉన్న ప్రాంతానికి చేరుకున్నారు. చుక్కలదుప్పిని మందనుంచి తీసుకుని మండల పశుసంవర్ధక శాఖాధికారితో పరీక్షలు చేయించి అవసరమైన ఆహారం అందించి తిరిగి అడవిలో వదిలిపెట్టారు.

రైతులకు పూర్తి న్యాయం చేస్తాం

జైనూర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): జైనూర్ మార్కెట్ కమిటీ పరిధిలోని రైతులకు పూర్తి న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటామని మార్కెట్ కమిటీ ఛైర్మన్ కుడిమెత విశ్వనాథ్ అన్నారు. సోమవారం ఆయన అధ్యక్షతన మార్కెట్‌కమిటీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసందర్భంగా విశ్వనాథ్ మాట్లాడుతూ మార్కెట్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ జైవంత్‌రావ్, డైరెక్టర్లు, ఎస్బీ రెడ్డి, పంద్ర షేకు, ఆడ నీలబాయి తదితరులు పాల్గొన్నారు.

కంది రైతుకు కలిసి రాని కాలం

- కంది పంటపై వర్షాల ప్రభావం
- రాలుతున్న పూత, కాత


దేవుల గూడలో సాగు చేస్తున్న కంది చేను

రెబ్బెన, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కంది సాగును అకాలవర్షం దెబ్బతీస్తోంది. మూడురోజులుగా జిల్లాలో అకాల వర్షాలు కురుస్తుండటంతో ఏపుగా వచ్చిన కంది పంట ఒక్కసారిగా కిందకి వాలిపోయింది. పూత, కాయలు రాలుతున్నాయని రైతులు దిగాలు చెందుతున్నారు. జిల్లాలో పత్తి తర్వాత రెండో పంటగా కంది సాగు చేస్తున్నారు. తొలుత ఆశాజనకంగా ఉన్నప్పటికీ వారంరోజులుగా మబ్బులతో ఉన్న వాతావరణం కందిపూతపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. చీడ పురుగుల బారినపడి దిగుబడి క్రమేణ తగ్గే అవకాశాలు ఉన్నాయని రైతులు దిగులు చెందుతున్నారు. జిల్లాలో మొత్తం 4వేలఎకరాల్లో కంది సాగవుతుండగా, రెబ్బెనలోనే 750 ఎకరాల్లో పండిస్తున్నారు. పత్తి అనుకున్నంత దిగుబడి రాకపోయినా కంది పంటతో నష్టాన్ని భర్తీ చేద్దామనుకున్న రైతుల ఆశలపై నీళ్లు చల్లినట్లవుతోంది. వాతావరణం సహకరిస్తే తప్పా కంది రైతు కోలుకునే పరిస్థితి లేదు. వ్యవసాయాధికారులు సూచించిన విధంగా పలు మందులు పిచికారి చేయగా కొంతమేర ఊరట లభిస్తోందని రైతులు తెలుపుతున్నారు.

అకాల వర్షాలతో ఇబ్బందులు..
-శ్రీనివాస్, కంది రైతు, దేవలగూడ



కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాలతో కంది పంటపై ప్రభావం కన్పిస్తోంది. కంది పంట పూత, కాయలు రాలిపోతున్నాయి. పత్తిపంట ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదు. కందిపై పంట ఆశలు పెట్టుకోగా అకాల వర్షాలు తీవ్రంగా నష్టపరుస్తున్నాయి.

ఆత్మరక్షణ క్రీడల్లో రాణిస్తున్న అక్కా, తమ్ముడు

కెరమెరి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటారి గ్రామానికి చెందిన జగన్, విజయ దంపతుల కూతురు గౌతమి, కుమారుడు కల్లేష్ ఆత్మరక్షణ క్రీడల్లో రాణిస్తూ అబ్బురపరుస్తున్నారు. జగన్ వృత్తిరీత్యా పోలీసు కానిస్టేబుల్. కూతురు, కుమారుడికి కరాటే, కిక్ బాక్సింగ్, కుంగ్‌ఫూ తదితర క్రీడల్లో శిక్షణ ఇప్పిస్తూ విజయాలు సాధిస్తున్నారు. గతనెల 17న కాగజ్‌నగర్ పట్టణంలోని ఫాతిమాకాన్వెంట్ స్కూల్‌లో 2వ నేషనల్ ఒపెన్ చాంపియన్‌షిప్‌లో గౌతమి, కల్లేష్ గోల్డ్‌మెడల్ సాధించారు. ఈనెల 8న జరిగిన నేషనల్ ఒపెన్‌ఆల్ కరాటే పోటీల్లో సైతం బంగారు పతకాలు సాధించి పలువురి మన్ననలు పొందారు. చిన్ననాటి నుంచే కరాటే పోటీల్లో ప్రతిభకనబర్చడంతో చిన్నారుల తల్లిదండ్రులను పలువురు అభినందిస్తున్నారు.


సాధించిన మెమోంటోలతో గౌతమి, కల్లేష్

న్యూస్ బాక్స్

సీఎం కప్ క్రీడలను విజయవంతం చేయాలి

కెరమెరి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో నిర్వహించే సీఎంకప్ క్రీడలను విజయవంతం చేయాలని ఎంపీడీవో అంజద్‌పాషా పేర్కొన్నారు. సోమవారం తహసీల్దార్, ఎంఈవో, ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులతో ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కబడ్డీ, వాలీబాల్, ఖోఖో అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ దత్తుప్రసాద్, ఎంఈవో ప్రకాష్ పాల్గొన్నారు.

పూలాజీబాబా సమాధి మహోత్సవాన్ని విజయవంతం చేయాలి

జైనూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో పాట్నాపూర్ సిద్దేశ్వర్ సంస్థాన్‌లో ఈనెల24,25 తేదీలలో నిర్వహించనున్న సద్గురు పులాజీబాబా సమాధి మహో త్సవాన్ని విజయవంతం చేయాలని సిద్దేశ్వర్ సంస్థాన్ చెర్మన్ ఇంగ్లే కేశవ్‌రావ్ కోరారు. అంతకు ముందు పులాజీ బాబా మందిర నిర్మాణంపై చర్చిం చారు. సమావేశంలో సంస్థాన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఇంగ్లే వామన్, కమిటీ ప్రధానకార్యదర్శి దుక్రె సుభాష్, సభ్యులు పాల్గొన్నారు.

రైతులకు తప్పనిపాట్లు

దహెగాం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా ఆదివారం రాత్రి వర్షం కురిసింది. గిరివెల్లి, ఖర్జీ, చంద్రపల్లి, పీకలగుండం గ్రామాల్లో భారీవర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాలలో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్ద అయింది. మూడురోజులుగా రైతులు ధాన్యాన్ని కాపాకు నేందుకు పడరానిపాట్లు పడుతున్నారు. చేతికి అందిన పంటలు తడిసి పోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తి పంట సైతం తడిసి ముద్దై నేల పాలైందని రైతులు వాపోతున్నారు.

చీరల పంపిణీ

కెరమెరి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని మహిళా సంఘాల మహిళలకు సోమవారం ఐకేపీ కార్యాలయంలో చీరలు పంపిణీ చేశారు. మహిళా సంఘాల్లో ఉన్న మహిళలకు, 18 సంవత్సరాలు నిండిన మహిళలకు చీరలను పంపిణీ చేస్తు న్నట్లు ఏపీఎం జగదీష్ తెలిపారు.

రైతులను ఆదుకోవాలి

ఆసిఫాబాద్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వర్షాలవల్ల పంటనష్టపోయిన రైతులను ఆదుకోవాలని సోమవారం సీపీఎం నాయకులు అదనపుకలెక్టర్ డేవిడ్‌కు వినతి పత్రం అందజేశారు. ఎలాంటి షరతులు లేకుండా పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆనంద్ కుమార్, రాజేందర్ తదితరులు ఉన్నారు.

వేతనం విడుదల చేయాలి

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ పీసా మొబిలైజర్స్‌కు పెండింగ్‌లో ఉన్న గౌరవవేతనం విడుదల చేయాలని డీపీవో భిక్షపతికి సోమవారం వారు వినతిపత్రం అందజేశారు. గ్రామాల్లో కార్యదర్శికి సహకరిస్తూ పరిసరాల పరిశుభ్రత, హౌజ్‌టాక్స్ వసూలు తదితర పనులు చేపడుతున్నామన్నారు. వెంటనే తమకు గౌరవవేతనం అందజేయాలని కోరారు.



పదోన్నతుల కోసం అధికారుల కౌన్సెలింగ్

శ్రీరాంపూర్, డిసెంబర్ 9(ఆంధ్రజ్యోతి): హెడ్‌ఛైన్‌మెన్, ఛైన్‌మెన్ పదోన్నతుల కోసం జీఎం కార్యాలయంలో సోమవారం ఎస్‌వోటు జీఎం ఎన్ సత్యనారాయణ కౌన్సెలింగ్ నిర్వహించారు. అంతర్గత ఉద్యోగుల్లో నలుగురు హెడ్‌ఛైన్‌మెన్ కోసం, ఎనిమిది మంది ఛైన్‌మెన్ కోసం హాజరయ్యారు. సీనియారిటీ ప్రాతిపదికన ప్రకటించిన ఖాళీలనుఉద్యోగులు ఎంచుకున్నారు. ఈ కౌన్సెలింగ్‌లో డీజీఎం(పర్సనల్) పిఅరవిందరావు, డీజీఎం(ఐఈడీ) చిరంజీవులు, ఏరియా సర్వే అధికారి వెంకటేశం, డిప్యూటీ పర్సనల్‌మేనేజర్ రాజేశ్వర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

శ్రీరాంపూర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఇంటర్నల్ ఆడిట్‌లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ ఉప ప్రధానకార్యదర్శి ముష్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా కోరారు. యూనియన్ ఆధ్వర్యంలో పిట్‌కమిటీ నాయకులను ఫైనాన్స్‌మేనేజర్ నాగలక్ష్మికి పరిచయం చేశారు. సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. ఆయాసమస్యల పరిష్కారానికి నాగలక్ష్మి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో జీఎం కమిటీ చర్చలప్రతినిధి బద్రిబుచ్చయ్య, ఇంటర్నల్ ఆడిట్‌పిట్ కార్యదర్శి జిరాజు, సహాయకార్యదర్శి రాజశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

రక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

శ్రీరాంపూర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రక్షణలో ప్రతి ఉద్యోగి భాగస్వామి కావాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎల్‌వి సూర్యనారాయణ అన్నారు. రక్షణ వారోత్సవాలను సోమవారం శ్రీరాంపూర్ సీహెచ్‌పీలో ప్రారంభించారు. రక్షణ వారోత్సవాల తనిఖీకమిటీ కన్వీనర్, కార్పొరేట్ జనరల్ మేనేజర్(ఈఅండ్‌ఎం) పి ఎలీషా జ్యోతిప్రజ్వలన చేశారు. సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్స్‌పై అవగాహన కలిగి ఉంటే ప్రమాదాలను నివారించవచ్చని వారు పేర్కొన్నారు. అనంతరం సీహెచ్‌పీలో కొనసాగుతున్న రక్షణ చర్యలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్‌వోటుజీఎం సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, తనిఖీ, రక్షణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జైపూర్: రక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఐకే ఓసీపీ ప్రాజెక్టు అధికారి ఏవీరెడ్డి పేర్కొన్నారు. సోమవారం 55వ వార్షిక రక్షణ పక్షోత్సవాల్లో భాగంగా ఐకే 1ఏ గని, ఐకే ఓసీపీలో కార్మికులచేత రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. ఆయన మాట్లాడుతూ కార్మికులు రక్షణతోకూడిన ఉత్పత్తిని చేయాలన్నారు. కార్యక్రమంలో గని మేనేజర్‌నాగన్న, రక్షణాధికారి సతీష్, సహానీ, పిట్ కార్యదర్శి నవీన్‌రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.


కప్పును చూపుతున్న అధికారులు

మల్టీ డిపార్టుమెంట్ సమావేశాలను విజయవంతం చేయాలి

మందమర్రిటౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఏరియాలో ఈనెల 10నుంచి 17వరకు వారం రోజులపాటు జరిగే మల్టీ డిపార్టుమెంటు సమావేశాలను విజయవంతం చేయాలని మందమర్రి జీఎం దేవేందర్ తెలిపారు. సోమవారం జీఎం కాన్ఫరెన్స్‌హాలులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023-24సంవత్సరంలో కంపెనీ సాధించిన అంశాలతోపాటు 2024-25లో కంపెనీ లక్ష్యాలను వివరిస్తామన్నారు.

సింగరేణి చేపట్టే సంక్షేమ కార్యక్రమాలు, భవిష్యత్ ప్రణాళికలు తెలియజేస్తామన్నారు. సమావేశంలో ఎస్‌వోటూ జీఎం విజయ ప్రసాద్, ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, బెల్లంపల్లి సెక్రెటరీ దాగంమల్లేష్, అధికారులు వెంకటరమణ, రాందాస్, రాజన్న, శ్యాంసుందర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమస్యలు తీరేదెన్నడు..?

5వ పేజీ తరువాయి

ఖర్చులన్నీ పోనూ చివరకు మిగిలేది రిక్తహస్తమేనని డీలర్లు ఆవేదన చెందుతున్నారు. దిగుమతి చార్జీలు తామే భరించడం వల్ల ఏమీ మిగలడం లేదంటున్నారు. ఒక్కోసారి తామే అదనంగా భరించాల్సిన దుస్థితి ఏర్పడుతుందనేది డీలర్ల వాదన. ఒక డీలర్ వంద క్వింటాళ్ల బియ్యం బస్తాలను దిగుమతి చేసుకుంటే రవాణా, డ్రైవర్, కూలీ మొత్తంగా రూ.2 వేల వరకు భరించాల్సి వస్తోందని చెబుతున్నారు. వంద క్వింటాళ్ల బియ్యాన్ని విక్రయిస్తే క్వింటాల్‌కు రూ.140 చొప్పున మొత్తంగా రూ.14 వేలు కమీషన్ రూపంలో డీలర్‌కు లభిస్తుంది. ఈ ఆదాయంలో షాపు అద్దె, విద్యుత్ చార్జీలు, హమాలీ, ఇతరత్రా ఖర్చుల చెల్లింపులు జరిగితే ఏమీ మిగలడం లేదని చెబుతున్నారు. ఈ క్రమంలో దిగుమతి చార్జీలు మరో భారంగా మారాయంటున్నారు. దీనిని ప్రభుత్వం గుర్తించి దిగుమతి చార్జీలను భరించాలని డిమాండ్ చేస్తున్నారు. దీని ద్వారా డీలర్‌కు నెలకు రూ.2 వేలు మిగిలే అవకాశం ఉందంటున్నారు. ఎంఎల్ఎస్ పాయింట్లలో కాంటా సరిగ్గా ఉండక బస్తాకు రెండు కిలోల బియ్యం తక్కువగా వస్తున్నాయని చెబుతున్నారు. క్వింటాల్ బియ్యం బస్తా కచ్చితమైన తూకంతో డీలర్లకు సరఫరా చేయాలని, షాపు రెన్యూవల్ శాశ్వత ప్రాతిపదికన జరగాలని, ప్రతి నెల 1వ తేదీలోగా బియ్యం సరఫరా చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా గౌరవ వేతనం రూ.5 వేలు వెంటనే కల్పించాలి. డీలర్లకు ప్రస్తుతం ఉన్న కమీషన్ రూ.140 నుంచి రూ.300కు పెంచుతామన్నారు. ఒక్కొక్కరికి రూ.5 లక్షల ఇన్సూరెన్స్ వర్తింప జేస్తామని హామీ ఇచ్చారు. డీలర్ చనిపోతే అతని స్థానంలో వారసులకు అవకాశం కల్పిస్తామన్నారు. కరెంట్ బిల్లు, గది కిరాయి చెల్లిస్తామన్నారు. డీలర్ల సమస్యలపై ముఖ్యమంత్రి రేవం త్‌రెడ్డి, పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలు మానవతా దృక్పథంతో సమస్యలు పరిష్కరించాలి.

- మోటపలుకుల సత్తయ్య, రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు

ఘనంగా అయ్యప్ప మండల పడిపూజ



పూజలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు

శ్రీరాంపూర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్‌లోని ప్రగతి మైదానంలో ఆదివారం రాత్రి మహా మండల పడిపూజ నిర్వహించారు. అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ(ఏబీఏపీ) ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములు శోభాయాత్రతో ప్రగతి స్టేడియం చేరుకున్నారు. సంజీవ నంబూద్రి గురుస్వామి చేతుల మీదుగా పడిపూజ, అభిషేకం నిర్వహించారు. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నదానం చేశారు. ఏబీఏపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బేతి తిరుమల్‌రావు, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌కిరణ్, జీఎం సత్యనారాయణ, పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రమేష్, పీడీ మహేందర్

దండేపల్లి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): లింగాపూర్ తెలంగాణ మోడల్ స్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ రామగిరి రమేష్, పీడీ ముత్యం మహేందర్‌లు తెలిపారు. ఇటీవల ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన అండర్ 19 బాలుర విభాగంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో జీవన్, ఉపేందర్, అంజనేయ శివప్రసాద్ ప్రతిభ కనబరిచారు. చండీగఢ్‌లో ఈనెల 12న జరిగే జాతీయస్థాయి క్రికెట్ పోటీలో ఆడనున్నారు. సోమవారం విద్యార్థులను ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్, పీడీ, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

మందమర్రిరూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మోడల్ స్కూల్, కళాశాలలో హవర్లీ బేస్డ్‌ప్రతిపాదికన ఫిజిక్స్ బోధించేందుకు అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సారా తస్లీమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ పొలిటికల్ సైన్స్‌బీఈడీ అర్హత కలిగి ఉండాలన్నారు. ఈ నెల 12లోగా సర్టిఫికెట్లతో మోడల్ స్కూల్‌లో అందజేయాలన్నారు.

విద్యార్థులు గణితంపై భయం వీడాలి

దండేపల్లి, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు గణితం అంటే భయం వీడాలని మండల విద్యాధికారి దుర్గం చిన్నయ్య సూచించారు. గణిత ఫోరం ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు సోమవారం ప్రతిభా పోటీ ప్రశ్నాపత్రాలను ఎంఈవో విడుదల చేశారు. ప్రధానోపాధ్యాయుడు నరేందుల శ్రీనివాస్. గణిత ఫోరం మండల అధ్యక్ష కార్యదర్శు రమేష్, తనుగుల రాజమౌళి, సభ్యులు, పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

చెన్నూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన వ్యాపారి బెజవాడ లక్ష్మీనారాయణ-రమాదేవి దంపతులు ఆస్నాద జిల్లాపరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థులకు సోమవారం ప్లేట్లను అందజేశారు. అనంతరం దాతను సన్మానించారు. హెచ్ఎం అనురాధ, విష్ణువర్ధన్‌రావు, వినయ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సినిమా టెక్నాలజీ కోర్సుల్లో నేడు అడ్మిషన్లు

నస్పూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): న్యాక్ ఆధ్వర్యంలో సినిమా టెక్నాలజీ కోర్సుల్లో చేరే ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 10వ తేదీ మంగళవారం ఫోన్ నంబరు 8328507232లో సంప్రదించాలని న్యాక్ అధికారి రవి ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ మూడు నెలలు ఉంటుందన్నారు. పదో తరగతి చదివి ఉండాలన్నారు.

ఎస్‌టీయూటీఎఫ్ కార్యవర్గం

బెల్లంపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): టీఎస్‌యూటీఎఫ్ జిల్లా మహాసభలు తాపీ సంఘం భవన్‌లో జరిగాయి. కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జి.చక్రపాణి, ప్రధాన కార్యదర్శి జి. రాజవేణు, ఉపాధ్యక్షులుగా కిరణ్‌కుమార్, లావణ్య, కోశాధికారిగా కిరణ్, కార్యదర్శులుగా నర్సయ్య, చంద్రమౌళి, బాపు, బబిత, దేవదాసు, సంతోష్‌కుమార్, శ్రీనివాస్, సుమనచైతన్య, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా రవి కుమార్, ఆడిట్ కమిటీమెంబర్‌గా సంపత్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శ్రీధర్, వెంకట్, శాంతకుమారి పాల్గొన్నారు.

వన్య ప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

జన్నారం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని ఎఫ్ఆర్‌వో కృష్ణరావు అన్నారు. సోమవారం పొనకల్, పుట్టిగూడ, బాదంపల్లి గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. విద్యుత్ వైర్లను, ఉచ్చులను అమర్చవద్దన్నారు. అడవిలోకి పశువులను తోలడం, అడవిలో సంచరించడం నేరమన్నారు.

పల్లె నుంచి పట్నం వరకు..

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు ఇద్దరు విద్యార్థులు ఎంపిక



అధికారుల నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న విద్యార్థి దాసరి చరణ్‌తేజ, గైడ్ టీచర్ సురేందర్

కోటపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విజ్ఞాన మేళాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటున్నారు. వారిలోని సృజనాత్మకత, ఆలోచన శక్తిని వెలికి తీసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైన్స్‌ఫేర్, ఇన్‌స్పైర్ మనక్ కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇటీవల మంచిర్యాలలో నిర్వహించిన జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శనలో 149 ప్రాజెక్టులను ప్రదర్శించగా 15ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి. ఇందులో రెండు ప్రాజెక్టులు మండలంలోని మారుమూల పల్లె అయిన అన్నారం ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. గైడ్ టీచర్‌గా విద్యార్థులను ప్రోత్సహిస్తున్న సైన్స్ టీచర్ సురేందర్, విద్యార్థులను పలువురు అభినందిస్తున్నారు.

ట్రాఫిక్ క్లియర్ డివైడర్

9వ తరగతి చదువుతున్న దాసరి చరణ్ తేజ ట్రాఫిక్ క్లియర్ డివైడర్‌పై చేసిన ప్రదర్శన పలువుర్ని ఆకట్టుకుంది. ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వాహనాల రాకపోకలు సులభతరం చేసేందుకు సాధారణంగా అయితే రోడ్డు వెడల్పు పనులు చేపడతారు. కొన్ని చోట్ల స్థలం లేక రోడ్డు వెడల్పుకు అవకాశం ఉండదు. ఈ ప్రాజెక్టు ద్వారా మూవింగ్ డివైడర్లను ఏర్పాటు చేసి సంకేతాల ద్వారా వాహన డ్రైవర్లకు సమాచారం అందిస్తూ సమస్యను తగ్గించవచ్చు. దీంతో ట్రాఫిక్ ఉన్న వైపు రోడ్డు వెడల్పు పెరిగి రాకపోకలకు సులువుగా ఉంటుంది. దీంతో సమయం, ఇంధనాన్ని ఆదా చేయడంతోపాటు శబ్ద కాలుష్యాన్ని తగ్గించవచ్చు.



అధికారుల నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న విద్యార్థి శ్రావణ్‌కుమార్, గైడ్ టీచర్ సురేందర్

ఈ ప్రదర్శన న్యాయ నిర్ణేతలను ఆకట్టుకోవడంతో దాసరి చరణ్ తేజ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.

- దాసరి చరణ్ తేజ జెడ్పీహెచ్ఎస్ అన్నారం

ఆటో మేటిక్ టాయిలెట్ క్లీనింగ్ సిస్టం



సైన్స్ ఫేర్‌లో ప్రాజెక్టు ప్రదర్శిస్తున్న విద్యార్థి శ్రావణ్‌కుమార్

ఆసుపత్రులు, రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్, పాఠశాలలు, కళాశాలలు ఇలా ప్రజలు ఎక్కువగా ఉండే చోట టాయిలెట్లలో వాటర్ పోయకుండా వెళ్లడం వల్ల అపరిశుభ్రంగా ఉంటాయి. దీంతో పలు వ్యాధులకు దారి తీస్తుంది. ఈ సమస్యను నివారించేందుకు ఆటోమేటిక్ అప్‌డేట్ టాయిలెట్ క్లీనింగ్ సిస్టం రూపొందించాడు. డోరు తెరవగానే ట్యాంకు నీటి సరఫరా జరిగి టాయిలెట్ శుభ్రం అవుతుంది. ఇలా లోపలికి వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు డోర్లు ఓపెన్ కావడంతో రెండు సార్లు నీటిని శుభ్రం చేసేందుకు దోహదపడుతుంది. ఈ ప్రదర్శన సైతం న్యాయ నిర్ణేతలను ఆకట్టుకోవడంతో రాష్ట్ర స్థాయికి ఎంపికైంది.

- శ్రావణ్‌కుమార్, జెడ్పీహెచ్ఎస్, అన్నారం

అందరి సహకారంతో..

పాఠశాల హెచ్ఎం రమేష్, ఉపాధ్యాయుల సహకారంతో ముందుకు వెళ్తున్నాం. విద్యార్థులకు రెండు నెలలుగా ఈ ప్రదర్శనలపై తర్ఫీదునిచ్చా. విద్యార్థులను ప్రోత్సహిం చడంతో వారు వినూత్నంగా ఆలోచించి ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. మారుమూల గ్రామమైన అన్నారం పాఠశాల నుంచి రెండు ప్రదర్శనలు ఎంపిక కావడం సంతోషంగా ఉంది.

-సురేందర్, గైడ్ టీచర్

న్యూస్ బాక్స్

ప్రయోగాలపై అవగాహన

కోటపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అన్నారంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సోమవారం జిల్లా సైన్స్ అధికారి మధుబాబు ఆధ్వర్యంలో జిజ్ఞాస సంచార ప్రయోగశాల విద్యార్థులకు ప్రయోగాలపై అవగాహన కల్పించారు. సైన్స్ ప్రయోగాలు చేసి వాటి గురించి విద్యార్థులకు వివరించారు. ఇన్‌స్ట్రక్టర్‌లు లక్ష్మణ్, సంపత్, ఇన్‌చార్జీ ప్రధానోపాధ్యాయుడు సురేందర్, ఉపాధ్యాయులు ఇంద్రసేనారెడ్డి, మానాజీ, మల్లేష్, నాజియా, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

తాండూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఈనెల 14న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం జరుగుతుందన్నారు. క్రిమినల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు, బ్యాంకు రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్‌బౌన్స్ తదితర రాజీపడ దగిన కేసుల్లో కక్షిదారులు రాజీపడాలని సూచించారు.

పట్టాలు ఇవ్వాలి

మందమర్రిరూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సారంగపల్లిలోని సర్వే నెంబరు 322, 323లో 40 ఏండ్లుగా నివసిస్తున్న దళితుల భూములకు పట్టాలు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు శివకుమార్ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వినతి పత్రం అందించారు. ఇండ్లు నిర్మించుకుని నివసిస్తున్నామని, పట్టాలు లేవని, ఇవి ప్రభుత్వ భూములనని తెలిపారు. ప్రభుత్వం మానవీయ కోణంలో ఆలోచించి పట్టాలు ఇవ్వాలని కోరారు. కార్యదర్శి అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి



నెన్నెలలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, నాయకులు కొయ్యల ఏమాజీ

నెన్నెల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో తడిసిన ధాన్యం, పత్తికి మద్దతు ధర చెల్లించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. నెన్నెల రైతులతో సోమవారం మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజీ మాట్లాడారు. వర్షానికి తడిసిన ధాన్యాన్ని, పత్తిని పరిశీలించారు. ప్రభుత్వం సక్రమంగా ధాన్యం సేకరణ చేపట్టక పోవడం వల్లే రైతులు నష్టపోయారని అన్నారు. నామమాత్రంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారని, సెంటర్లలో కనీస సౌకర్యాలు లేవన్నారు. టార్పాలిన్లు లేక ధాన్యం తడిసిందన్నారు. కొందరు రైతుల ధాన్యం నల్లబడి మొలకలు వచ్చిందన్నారు. రైతులు, ప్రజలు ఇక్కట్ల పాలవుతుంటే ఎమ్మెల్యే గడ్డం వినోద్, అధికారులు గ్రామాల వైపు కన్నెత్తి చూడటం లేదని ఆరోపించారు. రైతాంగానికి న్యాయం జరిగే వరకు తమ పార్టీ అండగా ఉండి పోరాడుతుందన్నారు. జిల్లా కార్యదర్శి గోవర్ధన్, నాయకులు అజ్మీరా శ్రీనివాస్, కమల ఉన్నారు.

కన్నెపల్లి, (ఆంధ్రజ్యోతి): అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు కొయ్యల ఏమాజీ, మాజీ ఎమ్మెల్యే అమురాజులు శ్రీదేవిలు డిమాండ్ చేశారు. ముత్తాపూర్ కొనుగోలుకేంద్రంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని లేకుంటే ఆందోళనలు చేస్తామన్నారు. బీజేపీ జిల్లా కార్యదర్శి గోవర్ధన్, మండల అధ్యక్షుడు బేరె రామయ్య యాదవ్, మాజీ సర్పంచు పుల్లూరి రాజయ్య, నాయకులు శ్రీనివాస్, కమల, రైతులు పాల్గొన్నారు.

జన్నారం, (ఆంధ్రజ్యోతి) : తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ జాన్సన్ నాయక్ డిమాండ్ చేశారు. పొనకల్, రోటిగూడ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. రైతులతో మాట్లాడి ధైర్యంగా ఉండాలని సూచించారు. మాజీ జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, నాయకులు జనార్దన్, భరత్‌కుమార్, శ్రీనివాస్‌గౌడ్, రాజారాంరెడ్డి, నర్సగౌడ్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ముగిసిన ఎస్ఎస్ఏల దీక్ష



కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్షలో సమగ్ర శిక్షా ఉద్యోగులు

నస్పూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నస్పూర్‌లోని కలెక్టరేట్ ఎదుట తెలంగాణ సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల సంఘం (ఎస్ఎస్ఏ-జేఏసీ) ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్ష సోమవారం ముగిసింది. ప్రభుత్వం నుంచి సానుకూలత రాకపోవడంతో మంగళవారం నుంచి సమ్మెలోకి వెళ్ళాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు సుమలత, కార్యదర్శి రాజన్నలు మాట్లాడుతూ నాలుగు రోజులుగా దీక్ష చేపట్టినట్లు తెలిపారు. రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం క్రమబద్ధీకరణ చేయాలన్నారు. న్యాయం జరిగే వరకు ఉద్యమం ఆపేదిలేదని స్పష్టం చేశారు. ఆర్గనైజింగ్ కార్యదర్శి సుమన, కార్యదర్శి దేవేంద్ర, నాయకులు జనార్దన్, నగేష్, కవిత, ఫణిబాల, కనకలక్ష్మి, కవిత, మూర్తి, రాకేష్, శ్రీధర్, ముఖేష్, రాంబాబు, ప్రణీత్ పాల్గొన్నారు. దీక్షకు ఐఎఫ్‌టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మానందం, పీడీఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, నాయకులు మల్లన్న, దారిశెట్టి అరుణలు మద్దతు తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు



పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

బెల్లంపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా సోమవారం మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత మాట్లాడుతూ వార్డులను నిత్యం పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజల ఆరోగ్యాలను రక్షించే కార్మికులు ఆరోగ్యంగా ఉండేందుకు ఎమ్మెల్యే వినోద్ ఆదేశాల మేరకు వైద్యపరీక్షలు చేయించినట్లు తెలిపారు. శానిటరీ కార్మికులు, డ్రైవర్లకు, ఆర్పీలకు వైద్య పరీక్షలు చేయించినట్లు తెలిపారు. పారిశుధ్య కార్మికులను మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు శాలువాలతో సన్మానించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, కౌన్సిలర్లు బండి ప్రభాకర్ యాదవ్, గెల్లి రాజలింగుయాదవ్, సూరం సంగీత, సరత, షేక్ ఆస్మా, షేక్ అఫ్సర్, సుజాత,నాయకులు శ్రీధర్, శ్రీనివాస్,బానేష్, శ్రీనివాస్, సత్తన్న, పాల్గొన్నారు.

తల్లిదండ్రులతో సమావేశం

బెల్లంపల్లిరూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లిలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో సోమవారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపాల్ అంజయ్య మాట్లాడుతూ విద్యార్థుల హాజరు శాతం పెంచడానికి తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. సెల్‌ఫోన్‌లను పిల్లలకు దూరంగా ఉంచాలన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని సూచించారు. అధ్యాపకులు కృష్ణవేణి, సోమయ్య, చంద్రయ్య, లక్ష్మణ్, కరుణాకర్, విమల్‌కుమార్, పాల్గొన్నారు.

యోగా టీమ్ కోచ్‌గా మంచిర్యాల వాసి



ఆర్.రోహిత్

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర యోగా టీమ్ కోచ్‌గా మంచిర్యాల జిల్లాకు చెందిన ఆర్.రోహిత్ ఎంపికైనట్లు జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అక్కల తిరుపతి వర్మ, సెక్రటరీ మండ శ్రీనివాస్‌లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర టీమ్ కోచ్‌గా ఎంపికైన రోహిత్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

ఏబీవీపీ కార్యవర్గం

బెల్లంపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఏబీవీపీ నగర కార్యవర్గాన్ని పట్టణంలో సోమవారం కరీంనగర్ విభాగ్ హాస్టల్స్ కన్వీనర్ ప్రవీణ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. బెల్లంపల్లి నగర కార్యదర్శిగా మిట్ట కార్తికేయ, నగర ఉపాధ్యక్షులుగా ఆకాశ్, శివతేజ, చందు, నగర సంయుక్త కార్యదర్శులుగా బానేష్, నితిన్, సాయిచరణ్, హాస్టల్స్ ఇన్‌చార్జీగా సోహెల్, సోషల్ మీడియా ఇన్‌చార్జీగా రామ్‌చరణ్‌తేజ, ఎస్ఎఫ్‌డీ కన్వీనర్‌గా అభిలాష్, ఎస్ఎఫ్ఎస్ కన్వీనర్‌గా అభిషేక్, కార్యవర్గ సభ్యులుగా అఖిల్, రంజిత్, మనోజ్‌కుమార్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో దీపక్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లా క్రికెట్ టీమ్ ఎంపిక పోటీలు

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో అండర్-14 జిల్లా క్రికెట్ టీమ్ ఎంపిక పోటీలను ఈ నెల 11వ తేదీన నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి కోదాటి ప్రదీప్, కోచ్ పి.ప్రదీప్‌లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2010 సెప్టెంబర్ 1వ తేదీ తర్వాత జన్మించిన క్రీడాకారులు అర్హులని, పాల్గొనే వారు తెలుపు రంగు డ్రెస్ కోడ్‌లో క్రికెట్ కిట్, జనన ధ్రువీకరణ పత్రాలను వెంట తీసుకొని రావాలని, 11న ఉదయం 9గంటలకు మైదానంలోని క్రికెట్ నెట్ వద్ద రిపోర్టు చేయాలని సూచించారు. వివరాలకు 9440010696 నంబర్‌ను సంప్రదించాలని వారు కోరారు.

నేడు సీఎం కప్ పోటీలు

తాండూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండల స్థాయి సీఎం కప్ పోటీలను ఈ నెల 10న తాండూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో జరుగుతాయని ఎంపీడీవో శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. పాల్గొనే వారు ఉదయం 9 గంటలకు హాజరు కావాలని కోరారు. వివరాలకు 9849998661లో సంప్రదించాలన్నారు.

12న సీఎం కప్ పోటీలు

కాసిపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 12న సీఎం కప్ మండల స్థాయి ఎంపిక పోటీలను నిర్వహిస్తామని ఎంపీడీవో సత్యనారాయణసింగ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్స్, ఫుట్‌బాల్,వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, యోగా పోటీలు ఉంటాయన్నారు. పాల్గొనే వారు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

భీమారం, (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 12న మండల స్థాయి సీఎం కప్ పోటీలను నిర్వహిస్తామని ఎంపీడీవో సోమవారం తెలిపారు. మండల స్థాయిలో అథ్లెటిక్స్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలు జరుగుతాయన్నారు. క్రీడల్లో పాల్గొనేందుకు 9849646224లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

టీఎన్‌జీవో సభ్యత్వ నమోదు

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో అటవీశాఖ కార్యాలయం, జిల్లా పంచాయతీ కార్యాలయంలో సోమవారం టీఎన్‌జీవో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నాన్ గెజిటెడ్ ఉద్యోగులంతా సభ్యత్వం తీసుకోవాలన్నారు. జిల్లా కార్యదర్శి భూముల రామ్మోహన్, కేంద్ర సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపురావు, ఉపాధ్యక్షుడు రామ్ కుమార్, మంచిర్యాల యూనిట్ అధ్యక్షుడు నాగుల గోపాల్, జిల్లా సంయుక్త కార్యదర్శి రవి కిరణ్, సభ్యులు పాల్గొన్నారు.

టైగర్ జోన్‌లో విద్యార్థుల పర్యటన

జన్నారం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కవ్వాల టైగర్ జోన్‌లోని గోండుగూడ, జన్నారం అటవీ ప్రాంతాల్లో సోమవారం జగిత్యాల వ్యవసాయ కళాశాల విద్యార్థులు పర్యటించారు. అడవిలోని గడ్డి క్షేత్రాలు, వాటి అభివృద్ధి అటవీ సంపద, వన్యప్రాణులు, పక్షులు, చెట్ల రకాలను వివరించారు. గడ్డి క్షేత్రాలను పెంచడం వల్ల కలిగే లాభాలను వివరించారు. లాలుబాయ్, బీట్ అధికారులు పాల్గొన్నారు.

వసతి గృహానికి భవనాన్ని ఏర్పాటు చేయాలి

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని బీసీ వసతి గృహానికి సొంత భవనాన్ని కేటాయించాలని నవతరం స్టూడెంట్ ఫెడరేషన్ (ఎన్ఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు నీరటి రామ్‌ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం బీసీ వసతి గృహం అద్దె భవనం ఎదుట ధర్నా నిర్వహించారు. సొంత భవనం లేక, కళాశాలలకు దూరంగా ఉండటం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. చలి తీవ్రత ఎక్కువగా ఉన్నందున దుప్పట్లను పంపిణీ చేయాలన్నారు. అమోఘ్, ఆశిష్, మహేష్, సాయిరాం, పాల్గొన్నారు.



ఆసిఫాబాద్ కలెక్టర్ ఎదుట రిలే నిరాహార దీక్ష చేస్తున్న ఉద్యోగులు

ఎస్ఎస్ఏ ఉద్యోగుల పోరుబాట

విద్యాశాఖలో పదమూడేళ్లుగా పనిచేస్తున్న సమగ్రశిక్షా అభియాన్(ఎస్ఎస్ఏ) ఉద్యోగుల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రభుత్వోపాధ్యాయుడికి సమానంగా పనులు చేస్తున్నా చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారు. ఉద్యోగభద్రత కల్పించి సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని గతంలో అధికారులు, ప్రభుత్వానికి వినతిపత్రాలు అందించారు. అయినా స్పందన లేకపోవడంతో 2023 ఆగస్టు17నుంచి 45రోజుల పాటు సాముహిక రిలే నిరాహార దీక్షలు చేశారు. దీక్షలు విరమించి విధుల్లో చేరితేనే చర్చలు జరుపతామని గత ప్రభుత్వం ప్రకటించడంతో విధుల్లో చేరారు. తరువాత ఎన్నికలు రావడం, కొత్త ప్రభుత్వం ఏర్పడటంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా మారింది. - వాంకిడి

జిల్లాలో 54 మంది సీఆర్పీలు పనిచేస్తున్నారు. క్లస్టర్ రిసోర్స్ పర్సన్ (సీఆర్పీ)లను స్కూల్ అసిస్టెంట్‌లకు సమానమైన విద్యార్హతతో నియమించారు. డిగ్రీ, బీఈడీ, టెట్, పీజీ పూర్తి చేసిన వారు సీఆర్పీలుగా పనిచేస్తున్నారు. వీరికి నెలకు వేతనం రూ. 19,350 మాత్రమే చెల్లిస్తున్నారు. అదేవిధంగా కేజీబీవీ, యూఆర్ఎస్‌ల్లో టీచింగ్, నాన్‌టీచింగ్, కంప్యూటరు ఆపరేటర్లు, ఎంఐఎస్ సమన్వయకర్తలు, ఐఈఆర్పీలు, పీటీఐ, ఎమ్మార్సీ మెసేంజర్‌లు తదితరులు కూడా పనిచేస్తున్నారు. వీ రంతా వేతనాలు పెంచడంతో పాటు క్రమబద్దీకరించాలని ఎంతోకాలంగా ప్రభుత్వాన్ని కోరుతున్నారు. విద్యారంగంలో నిర్వహించే పనులతోపాటు ప్రభుత్వం నిర్వహించే ఇతరకార్యక్రమాలకు కూడా వీరిని వినియోగించుకుంటున్నారు. మహిళా ఉద్యోగులకు ఆరునెలల ప్రసూతి సెలవులు మంజూరు చేసి క్లస్టర్ల సంఖ్యను పెంచడంతో పాటు పలు సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

ఇవీ డిమాండ్లు

- సమగ్ర శిక్షా ఉద్యోగులందరినీ విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలి
- అప్పటివరకు కనీస వేతన స్కేలును (ఎంటీఎస్) అమలు చయాలి
- ప్రతి ఉద్యోగికి జీవిత బీమా రూ.20 లక్షలు, ఆరోగ్య బీమా రూ.10 లక్షలు సౌకర్యం కల్పించాలి
- పదవీ విరమణ పొందితే రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.25లక్షలు కల్పించాలి
- ఉద్యోగి మరణిస్తే రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలి
- ప్రభుత్వ, విద్యాశాఖ నియమాకాలలో వెయిటేజ్ కల్పించాలి

సీఆర్పీలు కీలకం..

జిల్లా వ్యాప్తంగా 54మంది సీఆర్పీలు మండల విద్యాశాఖ పరిధిలో పనిచేస్తున్నారు. వీరిని కాంప్లెక్స్ హెచ్ఎంలకు కేటాయించారు. జిల్లాలో ఒక్కో సీఆర్పీ వారి క్లస్టర్ పరిధిలో 15పాఠశాలలను సందర్శిస్తుండడమే కాకుండా పాఠశాలల సంఖ్యకు అనుగుణంగా సందర్శిస్తూ ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరుతోపాటు మధ్యాహ్నభోజన వివరాలను పరిశీలిస్తారు. సమగ్రశిక్షా అభియాన్‌లో భాగంగా బడిబయట పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పిస్తారు. పాఠశాలల నుంచి విద్యార్థుల వివరాలు సేకరించి యూడైస్‌లో నమోదు చేస్తారు. సమగ్రశిక్షా అభియాన్ ద్వారా నిర్వహించే కార్యక్రమాలు పాటశాలల్లో అమలు అయ్యేలా చూస్తారు. ఏకోపాధ్యాయ పాఠశాలల్లోని ఉపాధ్యాయుడు సెలవుపై వెళ్లినపుడు ఆ క్లస్టర్ పరిధిలోని సీఆర్పీ ఆ పాఠశాలను నడిపిస్తారు. ప్రతి నెల పాఠశాల యాజమాన్య కమిటీ సమావేశం ఏర్పాటు చేసి వివరాలను నమోదు చేస్తారు. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించి, పాఠశాల ఖర్చుల వివరాలు సేకరించి జిల్లా విద్యాశాఖాధిరులకు అందజేస్త కీలకంగా వ్యవహరిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా సీఆర్పీలతోపాటు విద్యా శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని కోరుతు న్నారు.

నేటి నుంచి నిరవధిక సమ్మె..

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు ఈ నెల 6నుంచి విధులకు సెలవులు పెట్టి కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ప్రభుత్వం స్పందించక పోవడంతో మంగళవారం నుంచి విదులను బహిష్కరించి నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చారు. ఈ మెరకు సోమవారం సమగ్రశిక్ష ఉద్యోగులు స్థానిక ఎమ్మార్సీ కార్యాలయాల్లో ఎంఈవోలకు నిరవధిక సమ్మె నోటీసులను అందించారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి..

- దుర్గం సందీప్- సీఆర్పీల సంఘం జిల్లా కోశాధికారి



విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులకు ఉద్యోగభద్రత కల్పించి సమానవేతనం చెల్లించాలి. ఉపాధ్యాయుడికి ఉండాల్సిన అర్హతతో కాంట్రాక్టు పద్దతిలో సీఆర్పీలను తీసుకున్నారు. 13 సంవత్సరాలుగా చాలీచాలనీ వేతనాలతో పనిచేస్తున్నాం. ప్రభుత్వం తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ప్రభుత్వ ఉద్యోగులకు కల్పించే సౌకర్యాలను కల్పించాలి.

పలువురికి స్ఫూర్తిదాయకం.. జాకీర్ పాషా

- కాళ్లే ఆయనకు చేతులు
- పట్టుదలతో ఎంకాం పూర్తి
- కళారంగంలోనూ తనదైన ప్రతిభ



రెండు చేతులు లేని జాకీర్ పాషా

కాగజ్‌నగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నేటికాలంలో అన్నీ ఉన్నా నాతో కాదు.. అని నిరాశ నిస్పృహల మధ్య జీవించే వారు ఎందరో ఉన్నారు. అలాంటి వారికి చెంపపెట్టులా నిలుస్తున్నాడు. కాగజ్‌నగర్‌కు చెందిన దివ్యాంగుడు జాకీర్‌పాషా. పుట్టుకతోనే రెండు చేతులు లేకపోయినా ఆత్మవిశ్వాసం కోల్పో లేదు. కాళ్లనే చేతులనుకున్నాడు. మొక్కవోని ఆత్మవిశ్వాసం, సంకల్పంతో చిన్నప్పటి నుంచి అందరు విద్యార్థులతో సమానంగా చదివాడు. పీజీలో ఎంకాం పూర్తి చేశాడు. శారీరక అంగవైకల్యం జీవితానికి అడ్డుకాదని నిరూపించాడు. చిన్నతనంలో కాళ్లతో పలకపై అక్షరాలు దిద్దటం కష్టమైనప్పటికీ క్రమేణా అలవాటైంది. పదో తరగతిలో ఫస్ట్ ర్యాంక్ సాధించాడు. ఇలా ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ ఎంకాం పూర్తిచేశాడు. అలాగే కాళ్లతోనే కంప్యూటర్ ఆపరేటింగ్ నేర్చుకొని ట్యాలీ కోర్సు, పీజీడీసీఏ పూర్తి చేశాడు. ఒక్క చదువు, కంప్యూటర్ రంగంలోనే కాకుండా కళారంగంలో కూడా తన కంటూ చక్కటి ప్రతిభ చూపుతున్నాడు. పెన్సిల్‌ఆర్ట్, పెన్‌ఆర్ట్, నిబ్‌ఆర్ట్‌లో కూడా రాణిస్తున్నాడు. వివిధరంగాలకు చెందిన ప్రముఖుల చిత్రపటాలు గీచి అందిరితో భేష్ అనిపించుకుంటున్నాడు. ప్రభుత్వ కొలువు సాధించడమే తన ధ్యేయమని ఆత్మవిశ్వాసంతో పేర్కొంటున్నాడు.



కాలితో టీ తాగుతున్న జాకీర్ పాషా

ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరిస్తాం

- అదనపు కలెక్టర్ ఎం డేవిడ్



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ ఎం డేవిడ్

ఆసిఫాబాద్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమం ద్వారా అందిన దరఖాస్తులను త్వరగా పరిష్కరిస్తామని అదనపు కలెక్టర్ డేవిడ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు వాంకిడికి చెందిన అమృత తనకు దివ్యాంగ పెన్షన్ ఇప్పించాలని దరఖాస్తు అంద జేశారు. చింతలమానేపల్లి మండలం బాలాజీఅనుకోడ గ్రామానికి చెందిన లక్ష్మితనకు వృద్ధాప్య పింఛన్ ఇప్పించాలని దరఖాస్తు అందజేశారు. ఆసిఫాబాద్ పట్టణంలోని నూర్‌నగర్ కాలనీవాసులు సీసీ రోడ్డు నిర్మించాలని, కౌటాల మండలం ధనూరెట్టి గ్రామానికి చెందిన దేవక్క తన కూతురు దివ్యాంగురాలు అయినందున పెన్షన ఇప్పించాలని అర్జీలు సమర్పించారు. సిర్పూర్(టి) మండలం లోనవెల్లికి చెందిన కమల జిల్లాపరిషత్ పాఠశాలలో స్కావెంజర్ ఉద్యోగం ఇప్పిం చాలని, కెరమెరి మండలం దేవాపూర్‌కు చెందిన సంగీత తనకు అంగన్‌వాడీ సహాయకురాలిగా ఉద్యోగం ఇప్పించాలని దరఖాస్తు అందజేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆట, పాటలతో విద్య



బాలమేళలో పిల్లలతో అంగన్‌వాడీలు, అధికారులు

రెబ్బెన, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆట, పాటలతో విద్య నేర్పిస్తున్నట్టు సీడీపీవో సాదియా రుక్సాన తెలిపారు. సోమవారం గోలేటిలో ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన బాలమేళా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మూడు నుంచి ఐదు సంవత్సరాల పిల్లలను తప్పనిసరిగా సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలన్నారు. గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒక్కపూట సంపూర్ణ భోజనాన్ని అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన పిల్లలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మాజీసర్పంచి సుమలత, సూపర్‌వైజర్ తిరుపతమ్మ, కళావతి, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహ ముక్త్ భారత్‌పై అవగాహన

వాంకిడి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని బంబార ఆశ్రమపాఠవాలలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్‌లైన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం బాలల హక్కుల రక్షణ, బాల్య వివాహ్‌ముక్త్ భారత్‌పై అవగాహణ కల్పించారు. ఈసందర్భంగా బాలల సంరక్షణాధికారి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే హక్కులు, రక్షణ చట్టాలపట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల్య వివాహాలు చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే 1098లేదా100కి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మిప్రసన్న, చైల్డ్ హెల్ప్‌లైన్ సభ్యులు పీతాంబర్, సుకన్య, శకుంతల, సుగుణ, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

లింగాపూర్, డిసెంబర్ 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తుర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేజీబీవీ ఇన్‌చార్జి ప్రత్యేకాధికారి ప్రసన్న భారతి సోమవారం ఒక ప్రకటనలో తెలి పారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఇంగ్లిష్ సబ్జెక్టు బోధించుటకు ఆసక్తి గల మహిళా అభ్యర్థులు ఈనెల 12లోపు లింగాపూర్ కేజీబీవీలో దరఖాస్తులను సమర్పించాలన్నారు.

చట్టాలపై అవగాహన సదస్సు

ఆసిఫాబాద్ రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాబాపూర్ జ్యోతిబాపూలే పాఠశాలలో విద్యార్థి నులకు మహిళాచట్టాలపై షీటీం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. హింస, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైంలకు ఎవరైనా గురైతే షీటీంను సంప్రదించాలన్నారు. అతన్యవసర సమయాల్లో 100 లేదా షీటీం (87126 70564)ను సంప్రదించాలన్నారు. కార్యక్ర మంలో షీటీం ఇన్‌చార్జి సునీత, ప్రిన్సిపాల్ రత్నబాయి, ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

దహెగాం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖర్జీ అటవీ ప్రాంతంలో పులి కదిలికలు లేవుగాని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎఫ్ఆర్వో నిజాముద్దీన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఖర్జీ, గిరివెల్లి, అమర్ గొండ గ్రామాల అటవీప్రాంతంలో కదిలికలు ఉన్నాయా లేదా అని పరిశీలించారు. వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కూలీలు గుంపులుగా వెళ్లాలని సూచించారు. వన్య ప్రాణులు కనిపిస్తే, పశువులపై దాడిచేస్తే తమకు సమాచారం అందించాలన్నారు.

భర్తీ అయిన జూనియర్ అసిస్టెంట్ పోస్టు

సిర్పూర్(టి), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సబ్‌ట్రెజరీ కార్యాలయంలో 15ఏళ్లుగా ఖాళీగా ఉన్న జూనియర్ అసిస్టెంట్‌పోస్టు భర్తీఅయింది. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన గ్రూపు-4లో ఎంపికైన బి మధును ట్రెజరీకార్యాలయంలో భర్తీ చేసిందని ఎస్టీవోతిరుపతి తెలిపారు. కార్యాలయంలో పోస్టు భర్తీ కావడంతో అభినందనీయమన్నారు.

రాజస్థాన్ టు బెజ్జూరు

- పత్తి ఏరివేతకు ఇతర రాష్ట్రాల కూలీలు



బెజ్జూరులో పత్తి ఏరివేతకు చేనులకు వెళ్తున్న రాజస్థాన్ కూలీలు

బెజ్జూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం పత్తి ఏరివేత ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో స్థానికంగా కూలీల కొరత తీవ్రంగా వేధిస్తోంది. రాజస్థాన్ నుంచి కూలీల రాకతో రైతులకు కొంత వెసులుబాటు కలిగింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఈ ఏడాది రాజస్థాన్ నుంచి కూలీలు పత్తి ఏరివేతకు వలసవచ్చారు. గ్రామాల్లో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలు షెల్టర్లు ఏర్పాటు చేసుకుని పత్తిఏరివేత పనులు చేపడుతున్నారు. దీంతో స్థానిక రైతులకు కూలీల కొరత నెరవేరినట్లు కనిపిస్తోంది.

సమ్మె నోటీసు అందజేత

ఆసిఫాబాద్ రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష అభియాన్‌లో ఉద్యోగులను రెగ్యులర్ చేయా లని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రిలే దీక్షలు చేపడుతున్నారు. ఈ మేరకు ఈనెల 10నుంచి సమ్మె చేపట్టనున్నట్లు నోటీసును సోమవారం విద్యాశాఖ ఏడీ గమినాయిల్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌వోలు ఇంద్రాణి నాగసుధ, నలంద, అరుణ, తదితరులు పాల్గొన్నారు.



సమ్మె నోటీసు అందజేస్తున్న ఎస్‌వోలు

కమ్మేసిన పొగ మంచు



వాంకిడి రహదారిపై కమ్ముకున్న పొగ మంచు

వాంకిడి, డిసెంబరు 9: మండలంలో మూడురోజుల నుంచి తెల్లవారు జామున పొగమంచు కమ్మేస్తోంది. ఉదయం 8గంటల వరకు పొగమంచుతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పొగమంచు కారణంగా ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో లైట్లు వేసుకొని నెమ్మదిగా వాహనాలు నడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. మూడు రోజులుగా జిల్లాలో సూర్యుడి జాడే లేదు. ఓ వైపు పొగ మంచు మరోవైపు చిరు జల్లులతో ఉష్ణోగ్రతలు పూర్తిగా పడిపోయాయి. ఏదిఏమైనప్పటికీ మూడురోజులనుంచి మండల వ్యాప్తంగా దట్టంగా అలుముకున్న పొగమంచు చూపరులకు కనువిందు చేస్తోంది.

నేలవాలిన మొక్కజొన్న



నేలకొరిగిన మొక్క జొన్న పంట

కెరమెరి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో కురిసన వర్షానికి జొన్న, మొక్కజొన్న పంటలు పూర్తిగా నేలకొరి గాయి. సాధారణంగా వేసవిలో రైతులు జొన్నకర్రలను పశుగ్రాసంగా ఉపయోగిస్తారు. దీంతో వచ్చే వేసవిలో పశుగ్రాసం కొరత ఏర్పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎస్సీ వర్గీకరణను నిలిపేయాలి

- బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు అశోక్



కరపత్రాలను చూపుతున్న సంఘం నాయకులు

వాంకిడి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను నిలిపేయాలని భారతీయ బౌద్ధ మహాసభ అధ్యక్షుడు అశోక్ మౌల్కర్ కోరారు. సోమవారం మండలకేంద్రంలోని జేత్వాన్ బుద్ధవిహార్‌లో బౌద్ధసంఘం నాయకులతో ఎస్సీ వర్గీకరణప్రక్రియ నిలిపివేత కరపత్రాలను విడుదలచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్సీవర్గీరకణపై తీసుకున్న నిర్ణయాన్ని మార్చుకోవాలని తీర్మాణం చేశామన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు విజయ్, జైరాం,హంసరాజ్, రాజేంద్రప్రసాద్,విలాస్ తదితరులు పాల్గొన్నారు.

తప్పును కప్పిపుచ్చుకునేందుకే మాయమాటలు



మాట్లాడుతున్న మాలి సంఘం నాయకులు

వాంకిడి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వాంకిడి ఆశ్రమ పాఠశాల విద్యార్థిని శైలజ ఫుడ్ పాయిజన్‌తో కాకుండా ఆర్ఎంపీ వైద్యుల నిర్లక్ష్యం వల్లనే మృతి చెందిందని రాష్ట్ర విద్యాశాఖ కమిషన్ సభ్యులు వెంకటేశ్వర్ పేర్కొనడం సరైంది కాదని మాలి సంక్షేమసంఘం నాయకులు అన్నారు. సోమవారం స్థానికంగా వారు మాట్లాడుతూ విద్యార్థిని శైలజ నెలరోజుల పాటు హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నవంబరు 25న మృతి చెందిందన్నారు. ఈనెల 7న కమిషన్ సభ్యుడు వెంకటేశ్వర్ ఆశ్రమపాఠశాలను సందర్శించి ఫుడ్‌పాయి జన్ కాదని, ఆర్ఎంపీ వైద్యుల నిర్లక్ష్యం వల్లనే మృతి చెందిందని పేర్కొనడం సరికాదన్నారు. దీన్ని మాలిసంఘం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. సమావేశంలో నాయకులు మెంగాజీ, బాబురావు, మహేందర్, సుధాకర్, కృష్ణ, నాగేష్, మహేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పులులతోనే అడవులకు రక్షణ

కాగజ్‌నగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పులులతోనే అడవులకు రక్షణ అని కాగజ్‌నగర్ రేంజ్ అధికారి శశిధర్ బాబు తెలిపారు. సోమవారం డివిజన్‌లోని ఆయాశాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పులులను రక్షించుకుంటేనే అడవులకు మనుగడ ఉంటుందన్నారు. చలికాలం పులులు తమ పునరుత్పత్తి కోసం వస్తుంటాయన్నారు. పత్తి ఏరే కూలీలు తప్పకుండా గుంపులుగా వెళ్లాలన్నారు. పొలాలకు వెళ్లే సమయంలో మాస్కులు తప్పకుండా ధరించాలన్నారు. తద్వారా పులి దాడి చేయదన్నారు. పత్తి ఏరే సమయంలో తల వెనుకవైపు మాస్క్ ఉండాలన్నారు. పులి అడుగులు కన్పిస్తేతప్పకుండా తమకు సమాచారం అందించాలన్నారు.

19న మాదిగల మహాగర్జన

ఆసిఫాబాద్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఈనెల 19న నిర్వహించనున్న మాదగల మహాగర్జనను విజయ వంతం చేయాలని టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ధర్మయ్య కోరారు. సోమవారం మహాగర్జను పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతి, లక్ష్మణ్, మురళీ, హరీష్, వంశీ, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలపై కళాజాతా



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపడుతున్న ప్రజాసంక్షేమ పథకాలపై సోమవారం ఆసిఫాబాద్ పట్టణంలో కళాజాతా నిర్వహించారు. పాటలద్వారా ప్రజలకుఅవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాకారులుబాపు, మోహన్‌నాయక్, సోమశేఖర్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత



పట్టుబడిన పశువులు

పెంచికలపేట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెడ్వాయి గ్రామం నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న పశువులను పట్టుకున్నట్లు ఎస్సై కొమురయ్య తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. చెడ్వాయి నుంచి అనుమతులు లేకుండా పికప్ వాహనంలో అక్రమంగా ఆరుపశువులను తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు నిఘా ఉంచి వాహనాన్ని సోమవారం తెల్లవారు జామున పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు రాస్పెల్లికి చెందిన అంబిలపు శ్రీకాంత్‌తోపాటు జాడి రవీందర్, చిట్యాల సత్యనారాయణపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని, పశువులను కాగజ్‌నగర్‌లోని గోశాలకు తరలించినట్లు తెలిపారు.